క్లుప్తంగా

వీల్‌చైర్ వితరణ



ప్రసాద్‌కు వీల్‌చైర్ అందిస్తున్న సర్పంచ్ ఈశ్వర సంతోషి

భీమునిపట్నం: మండలంలోని తాటితూరు వద్ద దివ్యాంగుడు తాటిపూడి ప్రసాద్‌కు సర్పంచ్ శిరిడి ఈశ్వర సంతోషి వీల్‌చైర్ అందించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పతివాడ రాంబాబు, శాలివాహన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాస పోలమాంబకు ధాన్యంతో విశేష అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ ప్రజల ఇలవేల్పు రాసపోలమాంబను ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ప్రత్యేకంగా ధాన్యం, పట్టుచీర, జరబర పువ్వులతో అలంకరించారు. మజ్జివలస కళ్లాలకు చెందిన పుర్రేపు సాయి కృష్ణశర్మ, శ్రీనివాస శర్మ, కుటుంబ సభ్యుల సహకరంతో ఈ అలంకరణ చేశారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మాతృభాషపై పట్టు ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఈడీ రాణి మందా

కొమ్మాది: ప్రతి ఒక్కరికీ మాతృభాషపై పట్టు ఉండాలని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణా మిషన్ భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణి మందా అన్నారు. జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా రుషికొండలోని సంస్థలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో రెండో రోజు గిరిజన మాతృభాషల్లో విద్యా బోధన, మెథడాలజీ పుస్తకాలపై శిక్షణ సామాగ్రి తయారీ, సంబంధిత అంశాలను వివరించారు. ఆదివాసి ఒరియా, సవారా, కువి, కొండ, కోయ వంటి గిరిజన మాతృభాషలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కోర్సు కో–ఆర్డినేటర్ డా. చిక్కాల నాగరాజు, గిరిజన భాషా పండితులు పాల్గొన్నారు.

గ్రాఫిక్స్‌పై వర్క్‌షాపు ప్రారంభం



గ్రాఫిక్స్ గురించి వివరిస్తున్న అధ్యాపకులు

భీమునిపట్నం: తగరపువలస సమీపంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ గ్రాఫిక్స్‌పై అయిదు రోజుల వర్క్‌షాపు మంగళవారం ప్రారంభమైంది. మెకానికల్ డిపార్ట్‌మెంట్ సహకారంతో నిర్వహించిన వర్క్‌షాప్‌నకు ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.నారాయణరావు విచ్చేసి, గ్రాఫిక్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, బేసిక్ సైన్స్ విభాగాధిపతి పట్నాయక్ పాల్గొన్నారు.

కనులపండువగా దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: ఎండాడలోని ఎమ్‌కె గోల్డ్ అపార్ట్‌మెంట్స్‌లో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణుల చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు దా.నిష్కించిన భక్తదాస్ మాట్లాడుతూ దీపోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. సంకీర్తన, దామోదర హారతి, దామోదరాష్టకం, భక్తులచే వెయ్యి దీపాల హారతి, ప్రసాద పంపిణీ నిర్వహించారు.

తిమ్మాపురంలో ఆక్రమణల పర్వం

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ • హెచ్చరిక బోర్డులు మాయం చేసి విక్రయం



తిమ్మాపురంలో గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



తిమ్మాపురంలో అదే స్థానంలో మాయమైన హెచ్చరిక బోర్డు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పరిధిలోని బీచ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న తిమ్మాపురంలో లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ స్థలాలను ఓ వ్యక్తి కనుసన్నల్లో ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టి, విక్రయాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. తిమ్మాపురమా... అయితే ఓకే ! ప్రభుత్వ స్థలం ఆక్రమించుకోవచ్చు అనే భరోసా ఆక్రమణదారుల్లో కనిపిస్తోంది. అందుకేనేమో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడమే కాదు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు కూడా మాయం చేసి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీనిపై ఎవరు ఫిర్యాదు చేసినా మేమేం చేయలేమంటూ రెవెన్యూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఇక్కడ ఆక్రమణలు జరుగుతున్నా, హెచ్చరిక బోర్డులు తొలగించినా రెవెన్యూ ఉన్నత అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిని ఆసరాగా తీసుకున్న సదరు వ్యక్తి ఇక్కడ బీచ్ రోడ్డు మొదలు కొండ వరకు పట్టపగలే జేసీబీలు పెట్టి చదును చేసుకుని ప్లాట్లుగా విభజించి అమ్ముకుంటున్నాడు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మౌనం వీడి చర్యలు తీసుకోవాలని, లేకుంటే నేరుగా కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని స్థానికులు అంటున్నారు.

కమిషనర్ ఆదేశాలూ బేఖాతర్

ఇటీవల తిమ్మాపురంలో జీవీఎంసీ కమిషనర్ డా. సంపత్ కుమార్ పర్యటించారు. ఈ ఆక్రమణలు, అనధికారిక నిర్మాణాలపై సీరియస్‌గా తీసుకుని వాటిపై వెనువెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినప్పటికీ ఇక్కడి అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

బీచ్ రోడ్డు తిమ్మాపురం ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అనధికారిక నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ఇక్కడ జరిగిన అనధికారిక నిర్మాణాలపై నివేదిక తయారు చేసి, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తాం. అనధికార నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగిస్తాం.

– రామకృష్ణ, ఏసీపీ, భీమిలి

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

కాలనీవాసుల ఆందోళన



రిక్షా కాలనీలో అధికారులకు ఇచ్చిన వినతి పత్రాలతో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 6లో ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని రిక్షా కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురవుతున్న సదరు భూమి వద్ద, వారు అధికారులకు ఇచ్చిన వినతి పత్రాలు చూపుతూ మంగళవారం ఆందోళన చేపట్టారు. కాలనీవాసులు మాట్లాడుతూ ఇక్కడ సుమారు 50 సెంట్ల భూమిపై కొందరు కన్నేసి, ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిలో కమ్యూనిటీ హాలు నిర్మించి, ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని కోరారు. ఈ భూమిని కాపాడటానికి ప్రయత్నిస్తున్న వారిని అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి కూడా తీసుకువెళ్లామని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, యువత పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ



సాయిశశాంక్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

పీఎం పాలెం: ఇటీవల జరిగిన సౌత్ ఇండియా ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్) కళాశాల విద్యార్థి జి.సాయి శశాంక్ చాంపియన్ షిప్ ట్రోఫీ సాధించాడు. ఈ సందర్భంగా శశాంక్‌ను కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్ అభినందించారు.డిసెంబర్‌లో జరిగే ఇంటర్ వర్సిటీ గేమ్స్‌కు సాయి శశాంక్ ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లారెన్స్,డైరెక్టర్ సాయి ప్రశాంత్ పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్ పర్యటన

ఆర్‌సీ లే అవుట్ల పరిశీలన



కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్డులో పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

మధురవాడ: విశాఖ రూరల్ మండలం కొమ్మాది, పరదేశిపాలెం, ఆనందపురం మండలం గంభీరం, గిడిజాల, తర్లువాడ, కుసులువాడ, జగన్నాథపురంలలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ మంగళవారం క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఆయా ప్రాంతాల్లో సంస్థ అభివృద్ధి చేస్తున్న ఆర్‌సీ లే అవుట్‌లలో జరుగుతున్న మౌలిక వసతుల పనులను పరిశీలించారు. నిర్దేశించిన కాలపరిమితిలోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, ఎస్‌ఈ బలరామరాజు, ఎల్‌ఏవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు చేశాడని వ్యక్తిపై దాడి

మధురవాడ: భూ ఆక్రమణపై ఫిర్యాదు చేశాడనే కారణంతో ఆనందపురం మండలం శిర్లపాలెం గ్రామంలో ఓ వ్యక్తిపై కొందరు దాడి చేసి, గాయపరిచారు. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో జరుగుతున్న భూ ఆక్రమణ గురించి అదే గ్రామానికి చెందిన కోరాడ గౌరినాయుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ గ్రామానికి చెందిన షిడగం రమేష్, చిన్నారావు, అప్పారావు మరి కొంతమంది, సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి కర్ర, కత్తులతో దాడి చేశారు. ఘటనలో గౌరినాయుడి తల కు తీవ్ర గాయాలు కావడంతో, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తల్లి చిలకమ్మ, అక్క సింహాచలంపై కూడా దాడిచేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ వాసునాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న మత్స్యకారుల రిలే దీక్షలు

భీమునిపట్నం: భీమిలి తీర ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణలపై మత్స్యకారులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం ఆరో రోజు కొనసాగాయి. దీక్షల్లో పాల్గొన్న మత్స్యకారుల గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఆక్రమణల వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. దీక్షల్లో నాయకులు కాసరపు నర్సింగరావు, వాడమొదల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పీఠానికి 50 ఏళ్లు

- నేటి నుంచి సిద్ధేశ్వర స్వామి పీఠం స్వర్ణోత్సవాలు
- వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు





ఆలయంలో కొలువుదీరిన కుబేరుడు, చతుర్ముఖ బ్రహ్మ



మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠం

మధురవాడ: సిద్ధేశ్వర స్వామి పీఠం స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. పంచముఖ ఆంజనేయ స్వామి, నవగ్రహాలు, కుబేరుడు, చతుర్ముఖ బ్రహ్మ, ఏక నిధి, నవ నిధులు, లక్ష్మీ నారాయణుల సహిత అష్టలక్ష్మి తదితర 64మంది దేవతామూర్తులు కొలువైన అరుదైన పీఠంగా రాష్ట్రంలో ప్రత్యేకతను సొంతం చేసుకుంది. మధురవాడ హైవేను ఆనుకుని జీవీఎంసీ జోనల్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈ పీఠంలో బుధవారం నుంచి 3 రోజుల పాటు వార్షిక వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పీఠం ప్రారంభమిలా..

కడప రైల్వేకోడూరు సమీపంలోని చెట్టు గుంటకు చెందిన సిద్ధేశ్వర స్వామి సింహాచలం కొండపై ఉండే జడల సాధువు ఆదేశం మేరకు ఇక్కడికి వచ్చినట్లు చెబుతారు. మధురవాడలో జమదగ్ని మహాముని సంచరించిన ప్రదేశమైన హైవేను ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో 1974లో సిద్ధేశ్వర స్వామి ఈ పీఠాన్ని ప్రారంభించారు.

ప్రత్యేకతలివీ..

- ఈ పీఠంలో చతుర్ముఖ బ్రహ్మకు ఆలయం ఉండటం విశేషం. పీఠం వ్యవస్థాపకులైన సిద్ధేశ్వరస్వామి బ్రహ్మకు శాస్త్రోక్తంగా శాప విమోచన యాగాలు, ఇతర పూజలు జరిపించి ఈ దేవాలయం నిర్మించారు. ఇందులో చతుర్ముఖ బ్రహ్మ, సరస్వతీ దేవి, నవ నిధులతో పాటు కుబేర స్వామి, ఏక నిధితో చిత్రలేఖాదేవి విగ్రహాలు ఉన్నాయి.
- నవగ్రహాలను అతిపెద్ద ప్రాంగణంలో కొలువుదీర్చారు. సతీ సమేత, వాహన సమేత స్వయం మండపాలకృత స్థితిలో ఉన్న సుమారు 5 అడుగుల ఎత్తులో ఉన్న నవగ్రహాల విగ్రహాలు ఇక్కడ ఏర్పాటు చేశారు.
- సిద్ధి బుద్ధి సమేతుడైన సత్య గణపతి దేవాలయం
- పీఠంలో ప్రధాన ఆలయమైన సిద్ధేశ్వర స్వామితో కూడిన శివాలయం, పంచముఖ ఆంజనేయ స్వామి, సాయిబాబా, అష్టలక్ష్మి, నాగబంధాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, సిద్ధేశ్వరి, అన్నపూర్ణాదేవిల ఆలయాలు ఉన్నాయి.

వార్షిక వేడుకల కార్యక్రమాలివీ..

- రోజూ ఉదయం హోమాలు, సాయంత్రం శాంతి కల్యాణాలు
- మొదటి రోజు సీతారాముల కల్యాణం, రెండో రోజు లక్ష్మీనారాయణుల కల్యాణం, మూడో రోజు శివ పార్వతుల కల్యాణం
- 20న విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, హోమంతో ఉత్సవాలు ప్రారంభం
- 21న 108 కలశాల స్థాపన, కలశాల తిరువీధి, కలశ జలంతో అన్ని దేవాలయాల్లో దేవతామూర్తులకు అభిషేకం అనంతరం హోమాలు
- 22న హోమాలు, విశేష పూజలు. సిద్ధేశ్వరి మాత, శ్రీ చక్రాలకు కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, మహా పూర్ణాహుతి

ఇది మహదవకాశం



సిద్ధేశ్వరస్వామి శిష్యురాలైన మా సోదరి ఈ పీఠం నిర్వహణ చూసేవారు. పీఠం బాధ్యతలను పర్యవేక్షించడం ఆమె ద్వారా దేవుడు నాకు కల్పించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. ఇంతటి గొప్ప ఉత్సవాలు నిర్వహించడం దేవుని కృపే. అందరూ ఈ వేడుకల్లో పాల్గొని, స్వాములను దర్శించుకోవాలని కోరుతున్నాం.

–ఎ.నరసింహమూర్తి, పీఠం ధర్మకర్త

64మంది దేవతా మూర్తులు కొలువైన పీఠం



64 మంది దేవతా మూర్తులు కొలువై ఉన్న ఆధ్యాత్మిక పీఠం ఇది. ఇటువంటి ఆలయ సముదాయం ఎక్కడా లేదు. ఈ ఉత్సవాల్లో భాగస్వామిని కావడం ఆనందంగా ఉంది. భక్తులంతా వచ్చి సకల దేవతారాధన చేసుకుని, స్వాముల ఆశీస్సులు పొందాలి.

– దూసి రామలింగస్వామి శర్మ, ప్రధాన అర్చకుడు

మరుగుదొడ్ల ఆవశ్యకతపై ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ప్రజలు

పద్మనాభం: మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెంట గ్రామంలో విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. చేతుల శుభ్రత, మరుగుదొడ్ల ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, సర్పంచ్ బి.పావని, ఈవోఆర్డీ మీనా కుమారి పాల్గొన్నారు.

• ఆంజనేయుడిగా ఆదిదేవుడు



ఆదిదేవుడు ఆంజనేయస్వామిగా దర్శనమిచ్చారు. కారుపెడ్దరి కాశీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని మంగళవారం మారుతిగా ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. – పీఎం పాలెం

కోరాడలో కేంద్ర బృందం పర్యటన

సేంద్రియ సాగుపై రైతులతో మాటామంతి



సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి తెలియజేస్తున్న రైతు లక్ష్మణరావు

పద్మనాభం: మండలంలోని కోరాడలో మంగళవారం కేంద్ర బృందం సభ్యులు 50 మంది పర్యటించారు. వీరు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, కూరగాయల సాగులో లాభనష్టాల గుంచి రైతులను అడిగి తెలుసుకున్నారు. కోరాడ సర్పంచ్, రైతు కోరాడ లక్ష్మణరావుతో సేంద్రియ వ్యవసాయం గురించి మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వల్ల పెట్టుబడులు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని లక్ష్మణరావు కేంద్ర బృందం సభ్యులకు వివరించారు. బృందంలో ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన వారున్నారు. వీరి వెంట వ్యవసాయశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, రైతు సాధికార సంస్థ సీఈవో విజయ్ కుమార్, గుంటూరు వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అప్పలస్వామి, డీపీఎం ఎ.మోహనరావు, ఏడీ ప్రకాష్, పద్మనాభం ఏవో ఎంపీఎస్ చలం ఉన్నారు.

జాతీయ రహదారిపై వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు పాల్పడిన ఉమామహేశ్వరరావు

పీఎం పాలెం: మహిళా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై రక్తం కారుతూ, గాయాలతో ఓ వ్యక్తి పడి ఉండటం ఆ ప్రాంతంలో కలకలం రేపింది. ముందు హత్యాయత్నంగా భావించినప్పటికీ, పోలీసు దర్యాప్తులో ఆత్మహత్యాయత్నంగా తేలింది. ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. ఒడిశాలోని రాయగడకు చెందిన ఖండేపల్లి ఉమామహేశ్వరరావు (35) ఇసుకతోట పెట్రోల్ బంక్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. తల్లిదండ్రులు ఐదేళ్ల క్రితమే మరణించారు. భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నప్పటికీ, మూడేళ్ల క్రితం వారు ఎటో వెళ్లిపోయారు. ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్న ఉమామహేశ్వరరావు జీవితంపై విరక్తి చెంది, మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహిళా పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై ఆత్మహత్యకు యత్నించాడు. బీరు బాటిల్ గాజుపెంకుతో గొంతు కోసుకుని, శరీరంపై పలు చోట్ల గాయాలు చేసుకున్నాడు. రక్తసిక్తమైన దేహంతో రోడ్డుపై పడి ఉన్న అతడిని స్థానికులు గుర్తించి, పీఎం పాలెం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం గీతం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ర్యాలీ



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ: ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో నగరంపాలెం నుంచి స్వతంత్రనగర్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ 5వ వార్డు స్వతంత్రనగర్‌లోని వార్డు సచివాలయం వద్ద మధ్యాహ్నం 12 గంటల వరకు మహిళా పోలీస్ తప్ప కార్యదర్శులెవరూ అందుబాటులో లేకపోవడం, మహిళా పోలీస్‌తో పాటు తర్వాత వచ్చిన వారు ప్రజలు ఇచ్చే వినతిపత్రాలు స్వీకరించకపోవడంతో ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 68, 69 వార్డు సచివాలయాల వెల్ఫేర్ కార్యదర్శులకు ప్రజల ద్వారా 186 దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, ఆ పార్టీ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, జిల్లా మహిళా సమితి కార్యదర్శి ఎండీ బేగం, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'అపార్' రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

మధురవాడ: 'ఒక దేశం.. ఒక స్టూడెంట్ కార్డ్' పేరుతో కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన 'అపార్' రిజిస్ట్రేషన్‌ను సకాలంలో పూర్తి చేయాలని డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. పెద్దిపాలెంలోని నారాయణ ఇంగ్లిష్‌మీడియం పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన అపార్ రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయాలని, ఇందుకోసం మండలంలో ఒక ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. మండలంలో ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి, విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు శ్రద్ధతో పాఠాలు బోధించాలని సూచించారు. దీనివల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్ర బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పక్క బడ్డీ దగ్ధం



హైస్కూల్ వద్ద దగ్ధమవుతున్న బడ్డీ

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు చంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీని అనుకుని రోడ్డు పక్కన ఉన్న ఓ బడ్డీ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలివి.. కొమ్మాదిలో నివాసం ఉంటున్న అలమండ భాస్కరరావు హైస్కూల్ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై బడ్డీ ఏర్పాటు చేసి, వాచీలు, సెల్ ఫోన్లు రిపేర్ చేసేవారు. మంగళవారం సుమారు రాత్రి 10.15 గంటల సమయంలో రోజూ మాదిరి గానే దుకాణం మూసివేసి, ఇంటికి వెళ్లిపోయారు. కొద్ది సేపటికే సుమారు 10.40 గంటల సమయంలో బడ్డీ కాలిపోతున్నట్లు ఫోన్ రావడంతో సంఘటనాస్థలికి చేరుకున్నారు. అప్పటికే బడ్డీ చాలావరకు కాలిపోయింది. విశాఖ నుంచి వచ్చిన ఫైర్ ఇంజిన్ మంటలు అదుపు చేసింది. ప్రమాదంలో సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని బాధితుడు చెబుతున్నారు. బడ్డీలో ఉన్న సెల్ ఫోన్లు పేలి ప్రమాదం సంభవించిందా? లేక ఎవరైనా నిప్పు పెట్టారా అన్నది తెలియాల్సి ఉంది. పీఎం పాలెం పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని విచారణ చేస్తున్నారు.

కేజీబీవీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు



విద్యార్థులకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న సుభాష్

మధురవాడ: ఆనందపురం మండలం ఎల్‌వీ పాలెంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలికలకు మహాలక్ష్మి కల్చర్స్ అసోసియేషన్ అధినేత ఘట్టంనేని సుభాష్ చంద్రబోస్ మంగళవారం ల్యాప్‌టాప్‌లు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల కోసం వీటిని అందించినట్లు చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రతి పాఠశాలలో నిర్వహిస్తామని తెలిపారు. విద్యలో ప్రతిభ కనబరచే విద్యార్థులకు ఇంటర్ తర్వాత చదువుకయ్యే ఖర్చు తాను భరిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ కోరుకొండ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు నగరంపాలెం నుంచి అయోధ్యనగర్ మీదుగా హరిత అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లే రహదారికి కార్పొరేటర్ మొల్లి హేమలత మంగళవారం శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన రోడ్డు పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ రోడ్డును రూ.10.20లక్షలతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, ఆయా ప్రాంతాల పెద్దలు పాల్గొన్నారు.

శొంఠ్యాంలో తారు రోడ్డు నిర్మాణానికి ..



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీలో తారు రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ లెంక లావణ్య మంగళవారం శంకుస్థాపన చేశారు. గోల్డెన్ కీ లేఅవుట్ ప్రాంతం నుంచి శొంఠ్యాం మదుం వరకు రూ.పది లక్షలతో ఈ రోడ్డును నిర్మించనున్నారు. ఎంపీటీసీ పిల్ల దుర్గ రమణ, పెద్దలు పాల్గొన్నారు.